నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | HYDERABAD

గ్రేటర్ @ 35.2డిగ్రీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): అగ్నేయ గాలుల ప్రభావంతో నగర వాతావరణం వేడెక్కుతోంది. పగటి ఉష్ణోగ్రతలు 35డిగ్రీలు దాటి నమోదవుతుండడంతో జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 35.2డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 19.9డిగ్రీలు, గాలిలో తేమ 35శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే కొత్త నిర్మాణాలు జరిగేందుకు వీలుగా పాతవాటిని కూల్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రైల్వే స్టేషన్ భవనంలో కొంత మేర కూల్చివేస్తున్న దృశ్యం

హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో నీటి సరఫరాకు సిద్ధమైన ట్యాంకర్లు

భూగర్భజలం.. అథఃపాతాళం

ముంచుకొస్తున్న వేసవి కాలం.. మరింత దిగజారుతున్న నీటిమట్టం

2 నెలల ముందే మొదలైన ఎండల ప్రభావం

మహానగరంలో గణనీయంగా పడిపోయిన జలాలు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): భూగర్భజలాలు అంతకంతకూ దిగజారిపోతూ నగరవాసులకు కలవరం పుట్టిస్తున్నాయి. మరింత పాతాళానికి చేరుకుంటూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లోని అపార్టుమెంట్లు, నివాసగృహాల్లో బోర్లలో నీటి మట్టం మరింత కిందికి పడిపోతున్నది. ఫలితంగా ప్రైవేటు ట్యాంకర్లకు విపరీతంగా గిరాకీ పెరిగిపోయింది. జలమండలి వివిధ నీటి వనరుల మంచినీటి సరఫరాను యథావిధిగా కొనసాగిస్తున్నప్పటికీ అప్పుడే నగరంలోని పలు ప్రాంతాల్లో ఆ తాలూకు ఛాయలు కనిపిస్తున్నాయి.

2 నెలల ముందే..

వేసవి రాగానే సాధారణంగా మార్చి-ఏప్రిల్‌లో కనిపించే ప్రభావం ఈ సారి ఫిబ్రవరిలోనే మొదలైంది. రెండు నెలల ముందే ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ఆ మేరకు భూగర్భజల నీటిమట్టం కూడా క్రమంగా పడిపోతున్నది. 2024 డిసెంబరు-2025 జనవరి మధ్యనే సరాసరిన నాలుగైదు అడుగుల మేర భూగర్భజలాలు కిందకు పడిపోయాయి. గత ఏడాది హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ వర్షపు నీరు ఇంకే పరిమాణం కూడా రోజురోజుకీ తగ్గుతుండటం, ఉష్ణోగ్రతలు జనవరి నుంచే మొదలు కావడంతో నీటి వినియోగం కూడా భారీగా పెరుగుతున్నది. దీంతో భూగర్భజలాలను ఎక్కడికక్కడ తోడు తుండటంతో నీటిమట్టం లోతునకు పడిపోతున్నది. భూగర్భజల వనరుల శాఖ నివేదిక ప్రకారం... డిసెంబరు-జనవరి మధ్యనే హైదరాబాద్‌లో 0.33 మీటర్లు, మేడ్చల్-మల్కాజిగిరిలో 0.86 మీటర్లు, రంగారెడ్డిలో 1.08 మీటర్లు, వికారాబాద్‌లో 1.64 మీటర్ల లోతునకు జలాలు పడిపోయాయి.

పదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే..

హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో గత పది సంవత్సరాల్లో జనవరి నెలలో ఇదే అత్యధిక తగ్గుదల అని భూగర్భజల వనరుల శాఖ నివేదిక చెబుతున్నది. దీంతో పాటు ప్రధానంగా రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వచ్చే పశ్చిమ భాగంలోని ఐటీ కారిడార్‌తో పాటు దానికి అనుసంధానంగా ఉండే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. దీంతో ఆ ప్రభావం జలమండలి, ప్రైవేటు నీటి ట్యాంకర్లపై పడ్డాయి. బంజారా హిల్స్ ప్రాంతంలో జలమండలి సాధారణం కంటే రెట్టింపు స్థాయిలో నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సి వస్తుంది. ఐటీ కారిడార్‌లోనూ ఈ ప్రభావం నెమ్మదిగా మొదలైంది. రెండు రోజుల కిందట ఈ సీజన్‌లోనే అత్యధికంగా 35.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందనే దానిపై ఆందోళన కలిగిస్తున్నది.

అత్యంత ఆందోళనకరంగా మేడ్చల్ జిల్లా రాష్ట్రంలోనే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అత్యధిక లోతున భూగర్భజలాల లభ్యత ఉన్నట్లుగా భూగర్భజల వనరుల శాఖ నివేదికలో వెల్లడైంది. గతేడాది జనవరితో పోలిస్తే హైదరాబాద్ మినహా మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో భూగర్భజల నీటిమట్టం లోతుగా ఉన్నట్లు వెల్లడైంది. మునుపటికంటే మేడ్చల్‌లో 1.82 మీటర్లు, రంగారెడ్డిలో 0.29 మీటర్లు, వికారాబాద్‌లో 0.31 మీటర్ల లోపలికి జలాలు ఉన్నాయి. కాగా ఈ ఏడాది జనవరిలో రాష్ట్రంలోనే అత్యంత లోతున భూగర్భజలాలు ఉన్న జిల్లాగా వికారాబాద్ (12.29 మీటర్ల లోతు) మొదటి స్థానంలో ఉంటే ఆతర్వాత మేడ్చల్ జిల్లా (11.21 మీటర్ల లోతున) రెండో స్థానంలో ఉంది. ఇది ఒకవిధంగా ఆందోళన కలిగించే పరిణామం. రానురాను ఎండలు పెరుగుతుండటం, భూమిలోకి నీరు ఇంకే పరిస్థితి లేనందున మున్ముందు జలాలు మరింత లోతునకు పడిపోయే ప్రమాదముంది.

4 జిల్లాల పరిధిలో భూగర్భ జల నీటిమట్టం తీరు ఇలా ఉంది.. (మీటర్ల లోతులో)

జిల్లా	జనవరి-2024	మే-2024	డిసెంబరు-2024	జనవరి-2025
హైదరాబాద్	8.19	9.42	6.96	7.29
మేడ్చల్-మల్కాజిగిరి	9.38	13.94	10.35	11.21
రంగారెడ్డి	9.84	14.06	9.08	10.13
వికారాబాద్	11.98	16.46	10.65	12.29

లేనిది ఉన్నట్టు.. ఆన్‌లైన్ కనికట్టు

రేషన్ కార్డు దరఖాస్తుల్లో గందరగోళం

ఆన్‌లైన్‌లో తిరస్కరణకు గురవుతున్న అప్లికేషన్లు

70 శాతం మందికి కార్డు ఉన్నట్లుగా సూచిస్తున్న ఆన్‌లైన్

అయోమయానికి గురవుతున్న అర్జీదారులు

14 నెలల నుంచి దరఖాస్తులకే పరిమితం

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): రేషన్ కార్డు దరఖాస్తుదారులకు మీసేవలో చుక్కెదురవుతున్నది. ప్రజాపాలన, వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోనివారు మీసేవలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో మీసేవ కేంద్రాలకు అర్జీదారులు బారులు తీరుతున్నారు. దరఖాస్తు చేసుకున్నవారిలో వందకు 70 శాతం మందికి ఇప్పటికే రేషన్ కార్డు ఉన్నట్లు సూచిస్తుండటంతో కంగుతింటున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న చాలామందికి 'అలాటెడ్' అని సూచిస్తుండగా మరికొంతమందికి 'డూప్లికేట్' అని వస్తుందని వారు వాపోతున్నారు. తమకు రేషన్ కార్డు లేకున్నా ఉన్నట్లు ఎలా వస్తుందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాటెడ్ అని సూచిస్తున్న వారిని రేషన్ దుకాణాలు, పౌర సరఫరాల శాఖ కార్యాలయాలకు వెళ్లి అడగాలని మీసేవ నిర్వాహకులు చెబుతున్నారని అంటున్నారు. ప్రభుత్వం సూచించినట్లుగానే దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందని నిరసన వ్యక్తం చేస్తున్నారు.

కార్డు జారీ చేస్తారా?

ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల నుంచి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు దరఖాస్తులు తీసుకోవడమే కానీ సరైన మార్గదర్శకాలు జారీ చేసి అర్హులను గుర్తించిన దాఖలాలు లేవు. దరఖాస్తుల పేరిట జిరాక్సులకే వందలాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని అర్జీదారులు వాపోతున్నారు. ప్రభుత్వం మీద నమ్మకం లేకపోవడంతో ఒక్కొక్కరు రెండు మూడు సార్లు దరఖాస్తు చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకున్నా.. రేషన్ కార్డు వస్తదనే నమ్మకమైతే లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిపెట్టి తమకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

ఇంటి యజమానిగా పురుషులకు అనర్హత

ఇప్పటిదాకా రేషన్ కార్డులు మహిళల పేరుతోనే జారీ చేశారు. తాజా దరఖాస్తు చేసుకునే వాళ్లు కూడా ఇంటి యజమానిగా మహిళలనే సూచించాలని అధికారులు చెబుతున్నారు. కానీ ఒంటరిగా ఉండే పురుషులు, భార్య చనిపోయిన వారు తమ పేరుతో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. కానీ మీ సేవ కేంద్రాల్లో పురుషుల పేరుతో దరఖాస్తు చేస్తే ఆన్‌లైన్‌లో అంగీకరించడం లేదని చెబుతున్నారు. ఇంటి యజమానిగా మహిళ పేరు నమోదు చేస్తేనే దరఖాస్తు తీసుకుంటుందని అంటున్నారు. దీంతో ఒంటరిగా ఉండే వారు, భార్య చనిపోయిన వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమ పేరును మహిళగా నమోదు చేయాలని మీసేవ కేంద్రాల నిర్వాహకులను వేడుకుంటున్నట్లు చెబుతున్నారు. దరఖాస్తు దారులు బతిమాలడంతో కొన్ని కేంద్రాల్లో పురుషులను కూడా మహిళలుగా నమోదు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వమేమో పురుషుల పేరిట కూడా రేషన్ కార్డు తీసుకోవచ్చని చెబుతున్నా ఆన్‌లైన్‌లో మాత్రం స్వీకరించకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారు.

ఒక్కో కార్డుకు 2వేలిస్తే...

కొత్త రేషన్ కార్డులు ఇప్పటిస్తామంటూ మధ్యదళారులు దరఖాస్తుదారులకు వల వేస్తున్నారు. ఒక్కొక్క అర్జీదారుడి నుంచి రూ.2 వేల దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. తాము దరఖాస్తు చేస్తే రేషన్ కార్డు రావడం ఖాయమని భరోసా కల్పిస్తూ దండుకుంటున్నట్లు తెలుస్తున్నది. రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి మీసేవ నిర్వహకులు రూ.50 కంటే ఎక్కువ తీసుకోవద్దని, అంతకంటే ఎక్కువ తీసుకుంటే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. పనులు మానుకుని మీసేవలో గంటల తరబడి వేచి ఉండటం ఎందుకని భావించిన వారు దళారులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇదే అదనుగా భావించి అమాయక ప్రజల నుంచి వేలల్లో దండుకుంటున్నట్లు తెలుస్తున్నది. రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇండ్లు కూడా ఇప్పిస్తామంటూ దళారులు రూ.వేలల్లో డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు.

వచ్చే సోమ, మంగళ వారాల్లో..

మంచినీటికి అంతరాయం

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): నీటి మరమ్మతు పనుల వల్ల వచ్చే సోమవారం, మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఆగిపోనుంది. గ్రేటర్ హైదరాబాద్‌కు తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-1లోని కొండపాక పంపింగ్ స్టేషన్ వద్ద 3000 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు 900 ఎంఎం డయా వాల్వులు అమర్చనున్నారు. ఈ పనులు ఫిబ్రవరి 16,17 తేదీల్లో సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు కొనసాగుతాయి. ఈ 24 గంటల పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ఎస్సార్ నగర్, సనత్ నగర్, బోరబండ, ఎస్సీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంగళ్‌రావు నగర్, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఫతేనగర్, కూకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానంద నగర్, ఎల్లమ్మ బండ, మూసాపేట, భరత్ నగర్, మోతీ నగర్, గాయత్రి నగర్, బాబా నగర్, కేపీహెచ్‌బీ, బాలాజీ నగర్, హస్మత్ నగర్, చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్ నగర్, గాజుల రామారం, సూరారం, ఆదర్శ్ నగర్, భగత్ సింగ్ నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ, అల్వాల్, ఫాదర్ బాలయ్య నగర్, వెంకటాపురం, మచ్చ బొల్లారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయ్ నగర్, యాప్రాల్, చాణిక్యపురి, గౌతమ్ నగర్, సాయినాథపురం, చర్లపల్లి, సాయిబాబా నగర్, రాధికా, కొండాపూర్, డోయెన్స్, మాదాపూర్ (కొన్ని ప్రాంతాలు), హఫీజ్‌పేట, మియాపూర్, కొంపల్లి, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, జవహర్ నగర్, దమ్మాయిగూడ, నాగారం, నిజాంపేట, బాచుపల్లి, ప్రగతి నగర్, గండి మైసమ్మ, తెల్లాపూర్, బొల్లారం, ఎంఈఎస్, త్రిశూల్ లైన్స్, గన్‌రాక్, హకీంపేట ఎయిర్ ఫోర్స్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బీబీ నగర్ ఎయిమ్స్, ప్రజ్ఞాపూర్ (గజ్వేల్), ఆలేరు (భువనగిరి), ఘన్‌పూర్ (మేడ్చల్) ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగనుందని అధికారులు తెలిపారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

మగువలు దూసుకెళ్తున్నారు

ఏటేటా పెరుగుతున్న మహిళా డ్రైవింగ్ లైసెన్స్‌లు

గత ఏడాది 43,774 లైసెన్స్‌లు జారీ

రాష్ట్రంలో లైసెన్స్ జారీలో గ్రేటర్ వాటాయే అధికం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : నగరంలో ఏటేటా డ్రైవింగ్ లైసెన్సులు తీసుకుంటున్న మహిళల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. అటు స్వయం ఉపాధిలోనూ ఇటు ఉద్యోగాల్లోనూ నగరంలో మహిళల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండడంతో అందుకు అనుగుణంగా ద్విచక్ర, కారు లైసెన్సులు పొందుతున్న మగువల శాతం కూడా అదే స్థాయిలో ఉంది. కార్యాలయాలకు వెళ్లడం.. పిల్లలను స్కూల్ వద్ద దింపడం, పండుగలకు ఊరెళ్లడం వంటి పనులు సమయానుసారంగా చేసుకునేందుకు వీలుగా డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. దీంతో వీరి సంఖ్య కొంతకాలంగా క్రమంగా జోరందుకున్నది. గత ఏడాది 43,774 మంది మహిళలు లైసెన్స్‌లు పొందగా ఈ ఏడాది జనవరి నెల ముగిసేలోపే 1778 మంది మగువలు లైసెన్స్ పొందారు. .

కారు లైసెన్సులే ఎక్కువ

నగరంలో సుమారు 400లకు పైగా డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. వీటితో పాటు మరో 50- 60 వరకు మారుతి, టయోటా లాంటి కంపెనీ డ్రైవింగ్ స్కూళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఒక్కో బ్యాచ్ కు కనీసం 20-35 మంది చొప్పున కారు నడపడం నేర్చుకుంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలో 2019 నుంచి ప్రస్తుతం వరకు సుమారు 2 లక్షలకు పైగా మంది మహిళలు డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. ఇందులో అధిక భాగం కారు లైసెన్స్ ఉన్నవాళ్లే.

సరైన శిక్షణ తీసుకోవాలి

-పురుషోత్తం రెడ్డి, రవీందర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఉప్పల్

డ్రైవింగ్ నేర్చుకోవడానికి మహిళలు చాలా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇది చాలా మంచి పరిణామం. అందులోనూ కార్ల లైసెన్స్ పొందే వారి సంఖ్య అధికం. నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్న డ్రైవింగ్ స్కూళ్లలోనే శిక్షణ తీసుకోవాలి. రోడ్డు నిబంధనలు అన్నీ క్షుణ్ణంగా గుర్తుంచుకోవాలి. రోడ్డు ప్రమాదాలకు తావులేకుండా డ్రైవింగ్ నేర్చుకోవాలి. ఆలస్యమైనా పర్లేదు కానీ వచ్చిరానీ డ్రైవింగ్‌తో లైసెన్స్ పొందాలని ప్రయత్నిస్తే కుదరదు. ఆర్టీఏ నిర్వహించే అన్ని డ్రైవింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇలా...

2019 -30555
2020 -20851
2021 -29,898
2022 -31,902
2023-42,557
2024 -43,774
2025 -1778 (ప్రస్తుతం)

తహసీల్దార్.. డిజిటల్ అరెస్టు

ఏసీబీ అధికారులమంటూ ఎమ్మార్వోకు ఫోన్

రూ. 3.3 లక్షలు కాజేసిన సైబర్‌నేరగాళ్లు

కొత్త పంథాలో ప్రభుత్వ ఉద్యోగులపై నేరగాళ్లు గురి..

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): సైబర్‌నేరగాళ్లు రూట్ మార్చారు.. సీబీఐ అధికారులమంటూ ఇప్పటివరకు సాధారణ ప్రజలను మోసం చేసిన మోసగాళ్లు..ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్నారు. ఏసీబీ అధికారులమంటూ కొత్తగా అవతారమెత్తి తహసీల్దార్‌లను డిజిటల్ అరెస్టు చేస్తున్నారు. యాదాద్రి జిల్లాలో పనిచేసే ఒక తహసీల్దార్‌కు సైబర్‌నేరగాళ్లు ఫోన్ చేశారు. తామ ఏసీబీ నుంచి మాట్లాడుతున్నామంటూ చెప్పారు. అదే కార్యాలయంలో పనిచేసే ఒక ఉద్యోగి ఏసీబీకి దొరికిపోయాడు, అయితే అతడు తీసుకున్న లంచంలో మీ పాత్ర కూడా ఉందని మీపై కూడా కేసు నమోదు చేస్తున్నామంటూ బెదిరించారు. ముందుగా సెల్ ఫోన్‌ను స్విచాఫ్ చేసి మరో నంబర్ నుంచి మాట్లాడాలని చెప్పారు. వెంటనే సదరు తహసీల్దార్ తన కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్‌తో సైబర్ నేరగాళ్లకు ఫోన్ చేశాడు, లంచం వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ బతిమాలాడు. దీంతో... కేసు నమోదు కాకుండా ఉండాలంటే ఫలానా ఖాతాకు డబ్బు పంపించండంటూ నేరస్తులు సూచించారు. ఆ ఎమ్మార్వో తన బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు, తన భార్య, తన కొడుకు అతని స్నేహితుల వద్ద నుంచి దఫ దఫాలుగా రూ. 3.3 లక్షలు పంపించారు. ఆ తరువాత ఇదంతా మోసమని గుర్తించి వెంటనే రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కోల్డ్ స్టోరేజీలో ఉన్న చికెన్

వైన్‌షాపులకు, బార్లకు విక్రయాలు

బొల్లారం2, ఫిబ్రవరి 13: రెండు మూడు నెలలుగా కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన చికెన్‌ను సమీపంలోని వైన్‌షాపులకు, బార్లకు విక్రయిస్తున్న దుకాణాల్లో జీహెచ్ఎంసీ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. రసూల్‌పురలోని అన్నానగర్‌లో పూర్తిగా కుళ్ళి పాడైన స్థితిలో ఉన్న చికెన్ విక్రయిస్తూ లాభాలు పొందుతున్నట్లు సమాచారం అందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్ఎస్ఎస్, రవి చికెన్ దుకాణాలలో కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన 600 కిలోల చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. రెండు మూడు నెలల పాటు నిల్వ ఉంచిన కోళ్ల మాంసాన్ని అతి తక్కువ ధరలకే సమీపంలోని మద్యం దుకాణాలు, బార్లకు విక్రయిస్తున్నారని అధికారులు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించిన ఆహారభద్రత, టాస్క్ ఫోర్స్ అధికారులు పాడైపోయిన మాంసాన్ని గుర్తించి సీజ్ చేశారు.

• కూల్చివేతలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ): హైదరాబద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ(హైడ్రా) మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా తూంకుంట మున్సిపాలిటీ దేవరయంజాల్ గ్రామంలోని కోమటికుంటలో కూల్చివేతలను కొనసాగించింది. కోమటికుంటలోని ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో పూర్తిస్థాయి విచారణ చేపట్టిన అనంతరం గురువారం స్థానిక మున్సిపల్ అధికారులతో కలిసి అక్రమ కట్టడాలను కూల్చివేసింది. మరోవైపు కోమటికుంట చెరువు పరిధిలో నిర్మించిన ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్వెన్షన్‌కు ఎలాంటి నిర్మాణ అనుమతులు లేవని హైడ్రా వెల్లడించింది. మరోవైపు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఈ నిర్మాణాలు జరిగినట్లు వెల్లడి కావడంతో కూల్చివేతలకు హైడ్రా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. గతంలోనే ఇచ్చిన హైడ్రా నోటీసులపై హైకోర్టును ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్వెన్షన్ ప్రతినిధులు ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టిన హైకోర్టు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన వాటిని కూల్చివేయాలంటూ తీర్పును వెలువరించింది. దీనికి సమాధానంగా తామే తొలగిస్తామని, 30 రోజుల సమయం కావాలని ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్వెన్షన్ ప్రతినిధులు హైకోర్టును కోరారు. కానీ హైకోర్టు ఇచ్చిన 30 రోజులు గడువు పూర్తయినప్పటికీ నిర్మాణాలను కూల్చివేయకపోవడంతో నేరుగా హైడ్రా రంగంలోకి దిగి గురువారం ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్వెన్షన్‌లను నేలమట్టం చేసింది.

కోమటికుంటలో కూల్చివేతలు సాగుతున్న దృశ్యం